క్లుప్తంగా

24, 25 తేదీల్లో ఇస్రో, డీఆర్‌డీవో జాతీయ సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఇండియన్ సొసైటీ ఆఫ్ సిస్టమ్స్ ఫర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ హైదరాబాద్ చాప్టర్ (ఐఎస్‌ఎస్‌ఈ) 5వ జాతీయ సదస్సు ఈ నెల 24, 25 తేదీలలో జరగనుంది. ఇస్రో, డీఆర్‌డీవో, ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ ఆధ్వర్యంలో సిస్టమ్ అప్రోచ్ ఫర్ సెల్ఫ్ రిలయెన్స్ ఇన్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ (ఎస్‌ఎఎస్‌టీ–2023) అనే అంశం పై క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే జాతీయ సదస్సుకు రక్షణశాఖ శాస్త్రీయ సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి హాజరు కానున్నట్లు ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ అధ్యక్షత జరిగే కార్యక్రమానికి దేశవ్యాప్తంగా 400 మంది ఇంజినీర్లు, సైంటిస్టులు హాజరవుతుండగా డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ కామత్, ఇస్రో చైర్మన్ సోమనాథ్, బార్క్ డైరెక్టర్ అజిత్ కుమార్ మహోంతి పాల్గొని ప్రసంగిస్తారన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా అందిస్తున్న అన్ని రకాల వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అమీర్‌పేట డివిజన్ బాపూనగర్‌కు చెందిన రాథోడ్ జైసింగ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మెరుగైన చికిత్స కోసం మంత్రి తలసాని చొరవతో సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.2.50 లక్షలు మంజూరు కాగా బుధవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసంలో బాధితుడి కుమారుడికి ఎల్‌ఓసీ పత్రాన్ని మంత్రి అందజేశారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.17, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 50, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 13, క్యారెట్ 17, దొండ 35, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 45, కీర 15, దోసకాయ 35, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 19, చామగడ్డ 65, మొరంగడ్డ 15, కందగడ్డ 35, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 3–5. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

ఓయూలో దీక్షకు రావాలని రేవంత్‌కు ఆహ్వానం



రేవంత్‌కు ఆహ్వాన పత్రం ఇస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటన పై ఓయూలో చేపట్టనున్న మహా నిరసన దీక్షకు రావాలని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని విద్యార్థి నేతలు ఆహ్వానించారు. బుధవారం గాంధీభవన్‌లో రేవంత్ రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రం ఇవ్వగా మొదటి రోజు (24న) హాజరవుతానని రేవంత్ హామీ ఇచ్చినట్లు విద్యార్థి నేతలు పేర్కొన్నారు.

ఆర్ట్స్ కాలేజీ ఎదుట దీక్షలకు అనుమతి లేదు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట సభలు, సమావేశాలు, దీక్షలకు ఎలాంటి అనుమతి లేదని రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీ నారాయణ బుధవారం తెలిపారు. పాలక మండలి నిర్ణయం మేరకు రెండు సంవత్సరాలుగా ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఎలాంటి కార్యక్రమాలు చేపట్టరాదని నిర్ణయించినట్లు గుర్తుచేశారు. ఈ నెల 24, 25న నిర్వహించనున్న మహానిరసన దీక్ష తమ దృష్టికి రాలేదని రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

గో మహా పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

కాచిగూడ: అఖిల భారత గో సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోవులను కాపాడాలని గోవిందుడిని, నందులను కాపాడాలని నందీశ్వరుడిని వేడుకుంటూ గ్రామ గ్రామాన గోమ హత్యాన్ని తెలియజేస్తూ.. ఆగస్టు 6 నుంచి ఆగస్టు 31 వరకు హైదరాబాద్ నుంచి తిరుమలకు, తిరుమల నుంచి అరుణాచలానికి 25 రోజులు 786 కిలోమీటర్లు గో మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలకృష్ణ గురుస్వామి తెలిపారు. బుధవారం ఉగాది పర్వదినం రోజున దుండిగల్‌లోని గణపతి సచ్చిదానంద స్వామిజీ ఆశ్రమంలో గో మహా పాదయాత్ర పోస్టర్‌ను స్వామిజీ ఆవిష్కరించారు. గో రక్షణ కోసం తన సంపూర్ణ మద్దతు ఉంటుందని, పాదయాత్ర దిగ్విజయంగా సాగుతుందని స్వామిజీ ఆశీర్వదించారన్నారు.

షడ్రుచుల సమ్మేళనం

ఉగాది సంబురం

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

పంచాంగ శ్రవణం వినిపించిన వేద పండితులు

అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ



ప్రత్యేక పూజలు నిర్వహించిన కార్పొరేటర్ హేమ



ఉగాది వేడుకల్లో పాల్గొన్న బీఎన్. శ్రీనివాస్

సనత్‌నగర్: ఇంటింటా షడ్రుచుల మేళవింపు.. వాడవాడలా పంచాంగ శ్రవణానందం.. తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదిన వేడుకలను సనత్‌నగర్ నియోజకవర్గ వాసులు ఘనంగా నిర్వహించారు. సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం, బల్కంపేట్ ఎల్లమ్మ ఆలయం, అమీర్‌పేట్ హనుమాన్ దేవస్థానం తదితర దేవాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. పలు కాలనీ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించారు.

- జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీ నాల్గో వీధిలోని సత్యసాయి సూపర్ మార్కెట్ వద్ద జరిగిన ఉగాది వేడుకల్లో గుళ్లపల్లి వెంకట లక్ష్మీపతి దీక్షితులచే పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి వితరణ జరిగాయి.
- సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో ఉగాది పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈఓ శ్రీనివాసరాజు పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు రవీంద్రాచార్యులచే సాయంత్రం పంచాంగ శ్రవణం జరిగింది.

లాలాపేట: తార్నాక, లాలాపేట, శాంతినగర్, మాణికేశ్వర్‌నగర్ తదితర ప్రాంతాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాగ శ్రవణ కార్యక్రమాలు జరిగాయి. తార్నాక సెయింట్ ఆన్స్ స్కూల్ సర్కిల్‌లో విజయపురి కాలనీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో బీజేపీ రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి పాల్గొని ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

చిలకలగూడ : చిలకలగూడలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్పొరేటర్ సామల హేమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి ఆలయంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ నాగులూరి సాయిబాబా నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పంచాంగ శ్రవణం నిర్వహించారు.

కంటోన్మెంట్: ఉగాది పర్వదినం సందర్భంగా కంటోన్మెంట్ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. బోయిన్‌పల్లి సౌజన్య కాలనీలో బీఆర్‌ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ సభ్యులు పాండుయాదవ్, ప్రభాకర్ పార్టీ సీనియర్ నేతలు ప్రభుగుప్తా, మధుకర్, పిట్ల నాగేశ్, ప్రవీణ్ యాదవ్, నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. శ్రీగణేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాపూజీనగర్ నల్ల పోచమ్మ ఆలయ ప్రాంగణంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. పికెట్‌లోని తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె కృశాంక్ కార్యాలయంలో ఉగాది సంబురాలు ఘనంగా జరిగాయి.



బాపూజీనగర్‌లో: ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న శ్రీగణేశ్



మర్రి రాజశేఖర్ రెడ్డి కార్యాలయంలో ప్రత్యేక పూజలు



తార్నాకలో: ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న బండ చంద్రారెడ్డి



పికెట్‌లో: మన్నె కృశాంక్ కార్యాలయంలో



పూజలో పాల్గొన్న జంపన ప్రతాప్



జెక్‌కాలనీలో: విష్ణు సహస్రనామ పారాయణం చేస్తున్న కాలనీ నివాసితులు



పంచాంగ శ్రవణం కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

పురస్కారాల ప్రదానం

రాంగోపాల్‌పేట్/సనత్‌నగర్: తెలంగాణ ప్రభుత్వం అందించే ఉగాది పురస్కారాల్లో భాగంగా సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళీ దేవాలయానికి చెందిన వేద పారాయణుడు ఎల్లంబట్ల రామకృష్ణ శర్మ, సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ప్రధాన అర్చకులు పరాశరం రవీంద్రాచార్యులు అందుకున్నారు. బుధవారం రవీంద్రభారతిలో జరిగిన ఉత్సవాల్లో దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా ఇరువురు పురస్కారాలు అందుకున్నారు.



పురస్కారం అందుకుంటున్న రవీంద్రాచార్యులు



రామకృష్ణ శర్మకు పురస్కారం అందజేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

ముషీరాబాద్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ జాయింట్ సెక్రటరీ నవీన్‌గౌడ్ అన్నారు. బుధవారం ముషీరాబాద్ వాలీబాల్ గ్రౌండ్‌లో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో కుంగ్‌ఫూ శిక్షణా శిబిరాన్ని ముషీరాబాద్ ఎస్సై సురేందర్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సయ్యద్ అహ్మద్ భక్తియార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత విద్యతో పాటు క్రీడలపై దృష్టి సారించి రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కుంగ్‌ఫూ శిక్షణ మాస్టర్ ఎం.డీ.గౌస్, క్రీడాకారులు వేంకటేశ్వరరావు, మిన్నారావు, ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షులు మోహన్, ముషీరాబాద్ నియోజకవర్గ వైఎస్‌ఆర్‌టీపీ కో–ఆర్డినేటర్ బేటి నాలంక తదితరులు పాల్గొన్నారు.



తీన్మార్ మల్లన్నను విడుదల చేయాలి

కాచిగూడ: క్యూ న్యూస్ ఎండీ, ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్న అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని మున్నూరు కాపు స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. తీన్మార్ మల్లన్నను బేషరతుగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మున్నూరుకాపుల పట్ల ప్రభుత్వం అణిచివేత ధోరణి మానుకోకుంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక జనాభాగల మున్నూరు కాపుల సంఘటిత శక్తి ఎంటో బీఆర్‌ఎస్ పార్టీకి చూపిస్తామని ఆయన హెచ్చరించారు.

తబలా కళాకారుడికి సన్మానం

చిక్కడపల్లి: కథక్ కళాక్షేత్రం ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో తబలా కళాకారుడు తోట జ్ఞానేశ్వర్‌కు ఆత్మీయ సత్కారం జరిగింది. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ కవి రాము మాట్లాడుతూ.. జ్ఞానేశ్వర్ తబల వాద్య విన్యాసంలో అత్యంత ప్రతిభకలవారని ఆయనకు తగిన గుర్తింపు రాలేదని పలుకుబడి నేడు ప్రతిభను తొసిపుచ్చుతోందన్నారు. కృష్ణమోహన్ నిర్వాహకులు కథక్ కళాక్షేత్రం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పండిత్ అంజిబాబు, త్రినాథ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో స్వస్థత సభలు

చిలకలగూడ: హోసన్నా పెంతికోస్తు ఫెయిత్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో చిలకలగూడ మున్సిపల్ మైదానంలో స్వస్థత సభలు రెండోరోజు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. హెచ్‌పీఎఫ్‌ఎమ్ నిర్వాహకుడు పాస్టర్ జాయ్ నేతృత్వంలో నిర్వహిస్తున్న సభల్లో పాస్టర్ జెబ్‌రాజ్, జాకబ్‌చార్లెస్, మాథ్యూస్ హాజరై పలు అంశాలపై ప్రసంగించారు. ఏసుక్రీస్తును స్తుతిస్తు నిర్వహించిన సంగీతవిభావరి ఆకట్టుకుంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన మత విశ్వాసకులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. గురువారం (నేడు)తో ముగుస్తాయని పాస్టర్ జాయ్ తెలిపారు.



సభలో ప్రసంగిస్తున్న పాస్టర్ జెబరాజ్

ఉరేసుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

రాంగోపాల్‌పేట్: లాడ్జిలో గదిని అద్దెకు తీసుకుని ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం మీర్‌పేట్ గాయత్రినగర్‌కు చెందిన విశాల్‌కుమార్ (27) నగరంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 21న ఆఫీస్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి రెజిమెంటల్‌బజార్‌లోని సాగర్ లాడ్జికి వచ్చి గదిని అద్దెకు తీసుకున్నాడు. మధ్యాహ్నం తల్లి ఫోన్‌చేస్తే ఆఫీస్‌లో ఉన్నానన్నాడు. రాత్రైనా విశాల్‌కుమార్ ఇంటికి రాకపోవడంతో పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. బుధవారం మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన స్నేహితులు ఫోన్ లొకేషన్ చూసి లాడ్జి దగ్గరకు వెళ్లి విచారించగా ఇక్కడే ఉన్నట్లు తెలిపారు. పోలీసుల సహాయంతో గది తలుపులు తెరిచి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రాంగోపాల్‌పేట్: నెక్లెస్‌రోడ్‌లోని మక్తా గ్రౌండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రాంగోపాల్‌పేట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రాజు రాథోడ్ వివరాల ప్రకారం.. ఈ నెల 21వ తేదీ సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుడి వయస్సు 30–35 ఉంటుందని నలుపు రంగు చొక్కా, నీలం రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే 7901107650, 8712660180 నంబర్లను సంప్రదించాలన్నారు.

పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న ప్రొ. గాలి వినోద్‌కుమార్

లాలాపేట: ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాల డీన్ ప్రొ. గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ నెల 24న ఓయూలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరుద్యోగ విద్యార్థుల మహా నిరసన దీక్షకు మద్దతు తెలుపాలని బుధవారం విద్యార్థి సంఘాల నేతలు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రశ్నపత్రాల లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ టీఎస్‌పీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాలన్నారు. నష్టపోయిన విద్యార్థులందరికీ రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోట శ్రీనివాస్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, బైరు నాగరాజు, సంజీవ్, మానవతారాయ్ పాల్గొన్నారు.

గాయత్రికి ‘ఉత్తమ గళ మహిళ’ పురస్కారం

సనత్‌నగర్: ప్రముఖ డబ్బింగ్ కళాకారిణి, తన గళంతో రైల్వే సమాచారం అందించే వ్యాఖ్యత గాయత్రి ‘ఉత్తమ గళ మహిళ’ పురస్కారం అందుకున్నారు. ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో బేగంపేట కుందన్‌బాగ్‌లో నిర్వహించిన ఉగాది, మహిళా దినోత్సవ వేడుకల్లో మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి చేతుల మీదుగా ఆమె పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ.. సమాజహితాన్ని కాంక్షించే వారిని గుర్తించి సత్కరించడం ఎంతో అవసరమని, ఇది ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు. గాయత్రి గత మూడు దశాబ్దాలుగా డబ్బింగ్ కళాకారిణిగా ఎన్నో సినిమాలు, సీరియల్స్‌తో పాటు రైల్వేకు తన మధుర గాత్రాన్ని అందించడం ఎంతో అభినందనీయమన్నారు. మహిళా దినోత్సవాలు జరుపుకుంటున్న ఈ సమయంలో ప్రతిభావంతురాలైన మహిళను సత్కరించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానన్నారు. సినీ, టీవీ నటుడు అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. గాయత్రి లాంటి ప్రతిభ గల ఆర్టిస్టులను గుర్తించి సత్కరిస్తే వారు ఆ రంగంలో మరింతగా రాణించగలుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ వాసవీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొత్త వెంకటేశ్వరరావు, ఆకృతి సుధాకర్, విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు జగన్నాథచారి, ప్రొఫెసర్ జోగాచారి పాల్గొన్నారు.



గాయత్రికి పురస్కారం అందిస్తున్న మధుసూదనాచారి

ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు భద్రత పెంచండి



ఓయూలో మాట్లాడుతున్న నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు భద్రత పెంచాలని బీఎస్పీ, బీఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఓయూలో జరిగిన ముఖ్యనేతల సమావేశం అనంతరం బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటేష్ చౌహాన్, బీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నుంచి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ప్రాణహానీ ఉందని ఆయనకు ఏమైనా జరిగితే రాష్ట్రాన్ని అగ్నిగుండం చేస్తామని హెచ్చరించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనపై ఎవరు మాట్లాడినా అణచివేస్తున్నారని ఇటీవల ఆమరణదీక్ష చేపడితే భగ్నం చేసి అరెస్ట్ చేశారని గుర్తు చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే వారిపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించడం దారుణమన్నారు. చైర్మన్ జనార్దన్‌రెడ్డిని తొలగించే వరకూ ఉద్యమాలు కొనసాగుతాయని, ప్రవీణ్‌కుమార్‌కు వెంటనే సెక్యూరిటీ పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధర్మేందర్, దయాకరన్ మౌర్య, అంబేడ్కర్, శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

భారత్ జోడో క్రికెట్ టోర్నమెంట్

అంబర్‌పేట: భారత్ జోడో యాత్రతో కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్‌గాంధీ దేశ ప్రజల మనస్సులను గెలుచుకున్నారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. జోడో యాత్రతో దేశ ప్రజలు కాంగ్రెస్ పక్షాన నిలుస్తున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో కాంగ్రెస్ మాజీ ఎంపీ వి.హన్మంతరావు ఆధ్వర్యంలో భారత్ జోడో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించడంతో కాంగ్రెస్ పార్టీ మరింత పటిష్టతకు దోహదపడుతుందన్నారు. బుధవారం అంబర్‌పేట జలమండలి క్రికెట్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన భారత్‌జోడో క్రికెట్ టోర్నమెంట్‌కు రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. క్రీడా టోర్నమెంట్‌లు యువతలో ఐక్యత, స్ఫూర్తిని నింపుతాయని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ టోర్నమెంట్‌లో 8 రాష్ట్రాల నుంచి 8 జట్లు పాల్గొంటున్నాయని, రాహుల్‌గాంధీ స్ఫూర్తితో టోర్నమెంట్‌ను ప్రారంభించినట్లు వీహెచ్ తెలిపారు.

